ఏక దంతాయ.. బహు రూపాయ..

- కొలువుదీరిన గణనాథుడు
- వేడుకగా వినాయక చవితి సంబరాలు
- కోలాహలంగా నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం
- మండపాల్లో వినాయకుడికి ప్రత్యేక పూజలు


కల్లు గీత కార్మికుడి అవతారంలో వినాయకుడు


నందమూరినగర్ మండపంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఆడారి ఆనంద్ కుమార్, బెహరా భాస్కరరావు

విశాఖ విద్య: వినాయక చవితి ఉత్సవాలు సోమవారం కోలాహలంగా ప్రారంభమయ్యాయి. తొలి పండగను ప్రజానీకం భక్తి శ్రద్ధలతో చేసుకున్నారు. ఏక దంతుడు విభిన్న రూపాల్లో కొలువుదీరాడు. ప్రత్యేకంగా అలంకరించిన మండపాల్లో కొలువుదీరిన గణనాథులకు ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు.

- జీవీఎంసీ 52వ వార్డు ఓల్డ్ కరాస, శాంతినగర్‌లో భారీ గణనాథుడి విగ్రహాలు ఏర్పాటు చేశారు. డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ కుటుంబ సమేతంగా మండపాన్ని సందర్శించి వినాయకుడికి పూజలు నిర్వహించారు. 52 వార్డు యువజన నాయకుడు జియ్యాని విజయ్ కుమార్, శ్రీ బంగారమ్మ దుర్గాలమ్మ ఆలయ కమిటీ కరాస రాక్ స్టార్స్ సభ్యులు పాల్గొన్నారు.

మల్కాపురం: వినాయక చవతి సందర్భంగా పారిశ్రామిక ప్రాంతంలో వివిధ రూపాల్లో గణనాథుడు కొలువుదీరాడు. మండపాలు పోటాపోటీగా ఏర్పాటు చేశారు. వాటిలో సందేశం అందించే విధంగా గణపతిని ప్రతిష్ఠించారు. మల్కాపురం గొల్లవీధి వద్ద యాదవ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పాండురంగ స్వామి ఆకారంలో ఉన్న గణనాథుడిని నెలకొల్పి పూజలు చేశారు.

- గాంధీజీవీధి వద్ద కాళింగిణిపై చిన్ని కృష్ణుడు నృత్యం చేస్తున్నట్టు గణపయ్యను నెలకొల్పారు.
- నగరాలవీధి వద్ద ఓటింగ్‌పై అవగాహన కల్పించే విధంగా గణనాథుడిని అధికారిగా, కుమార స్వామిగా ఉన్నట్టు నెలకొల్పారు. ఇదే ప్రాంతంలో చంద్రయాన్-3 రాకెట్ సెట్ వేసి అందులో గణపతిని నెలకొల్పారు. జీవీఎంసీ 59వ వార్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయ కర్త ఆడారి ఆనంద్‌కుమార్ దర్శించుకుని పూజలు చేశారు.

ఆకట్టుకుంటున్న వినాయక మండపాలు

గోపాలపట్నం: గోపాలపట్నం పరిధిలో యువకులు, భక్తులు రూపొందించిన మండపాలు ఆకట్టుకుంటున్నాయి. జీవీఎంసీ 91వ వార్డు పాత గోపాలపట్నంలో కల్లు గీత కార్మికుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కల్లు గీస్తున్న వినాయకుడి విగ్రహం చూపరులను ఆకట్టుకుంటోంది.

- కొత్తపాలెం ప్రధాన రహదారిలో స్థానిక యువకులు మగధీర సెట్ వేశారు. కాళికా మాత విగ్రహంలా వినాయకుడిని ప్రతిష్ఠించారు.
- గవరవీధిలో గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో గౌరీ యూత్ పర్యవేక్షణలో 23 అడుగు భారీ విగ్రహం ఏర్పాటు చేశారు. ప్రతీ రోజు విశేష పూజలు నిర్వహిస్తున్నారు.
- ఇందిరానగర్‌లో స్థానిక యువకులు ఏర్పాటు చేసిన రైల్వే భోగిలా ఏర్పాటు చేసిన వినాయక మండపం ప్రత్యేక ఆకర్షణగా ఉంది.
- వెంకటాపురంలో స్థానికులు శివలింగం రూపంలో మండపాన్ని ఏర్పాటు చేశారు.

ప్రత్యేక పూజలు

సింధియా: జీవీఎంసీ 62వ వార్డు దుర్గానగర్, ఎస్సార్‌కాలనీ, త్రినాథపురం, అంబేడ్కర్‌కాలనీల్లో వినాయక ఉత్సవాల సందడి కనిపించింది. హనుమాన్ యూత్, డీసెంట్‌బాయ్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపాల్లో వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు తొలిపూజ చేసి ఉత్సవాలను ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు నక్కా సూర్యనారాయణ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


శాంతినగర్‌లో గణనాథుడికి పూజలు చేస్తున్న డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్


దుర్గానగర్‌లో వినాయకుడిని దర్శించుకుంటున్న కార్పొరేటర్ లక్ష్మణరావు


గవర వీధిలో ఏర్పాటు చేసిన 23 అడుగుల వినాయక విగ్రహం


కొత్తపాలెంలో మగధీర సినిమా సెట్‌ను తలపిస్తున్న వినాయక మండపం


పచ్చని చెట్లు.. ప్రగతికి మెట్లు సందేశాన్ని ఇస్తున్న గణనాథుడు


ఇందిరానగర్‌లో రైల్వే బోగీగా వినాయక మండపం


ఓటు విలువ వివరిస్తున్న వారితో గణనాథుడు


59వ వార్డు వద్ద జరిగిన పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఆడారి ఆనంద్‌కుమార్


గాంధీజీవీధి వద్ద సర్పంపై నృత్యం చేస్తున్న రూపంలో గణపయ్య


పాండు రంగస్వామి రూపంలో గణనాథుడు

సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

78932 44734

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

నిరుపయోగంగా వాటర్ ట్యాంక్



అలంకార ప్రాయంగా ఉన్న వాటర్‌ట్యాంక్

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెం వుడాకాలనీ వాకింగ్ పార్కులో మరుగుదొడ్లకు అవసరమైన వాటర్ ట్యాంకు ఏర్పాటు చేశారు. అయితే ట్యాంక్ ఏర్పాటు చేసిన అధికారులు దానికి పైపులైన్ కనెక్షన్ ఇవ్వడం మరిచారు. దీంతో ఇక్కడ మరుగుదొడ్లకు వెళ్లిన వారు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. అధికారులు స్పందించి సమస్యకు పరిష్కారం చూపాలని వాకర్స్ కోరుతున్నారు.

ఘనంగా శ్రీనృసింహ హోమం


నృసింహ హోమం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని సింహగిరిపై మంగళవారం శ్రీ నృసింహ హోమం ఘనంగా జరిగింది. లోక కల్యాణార్థం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి జన్మ నక్షత్రమైన ప్రతీ స్వాతి నక్షత్రం రోజున సింహగిరిపై నృసింహ హోమం నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఉదయం 7గంటల నుంచి ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మండపంలో నృసింహ హోమం ఘనంగా నిర్వహించారు. తొలుత చక్రపెరుమాళ్లను ఊరేగింపుగా కల్యాణ మండపం వద్దకు తీసుకొచ్చి హోమ గుండం వద్ద అధిష్ఠంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కలశారాధన, అగ్నికార్యం చేశారు. అనంతరం నృసింహ హోమం విశేషంగా నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతి, కుంభప్రోక్షణ చేశారు. హోమంలో ఉంచిన ప్రధాన కలశాన్ని ప్రధానార్చకుడు ఇరగవరపు రమణాచార్యులు శిరస్సుపై పెట్టుకుని తిరువీధిగా ఆలయంలోకి తీసుకెళ్లి స్వామివారి మూల విరాట్‌కు సమర్పించారు. తదుపరి ఆజలాలను భక్తులపై చల్లారు. దేవస్థానం తరఫున ఉభయ దాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

తాపీ ధర్మారావు జయంతి వేడుకలు నేడు


గోడపత్రికను ఆవిష్కరిస్తున్న రిజిస్ట్రార్ వి.కృష్ణమోహన్ తదితరులు

ఏయూ క్యాంపస్: తాపీ ధర్మారావు జయంతి వేడుకలను ఆంధ్ర విశ్వవిద్యాలయం బీఆర్ అంబేడ్కర్ అసెంబ్లీ హాల్లో బుధవారం నిర్వహించనున్నట్లు తెలుగు శాఖాధ్యక్షుడు ఆచార్య జర్ర అప్పారావు తెలిపారు. ఆంధ్ర విశ్వకళాపరిషత్, తెలుగు, సంగీత నృత్య విభాగం, సమైక్య భారతి-విశాఖ రచయితల సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో తెలుగు మాధ్యమాల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. మంగళవారం ఆంధ్ర విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ కార్యక్రమ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పత్రికా రంగంలో ముందుకు నడుస్తూ మరో వైపు సాహిత్యాన్ని నడిపించిన నవీన వైతాళికుడు ధర్మారావని కొనియాడారు. హేతువాదిగా, నాస్తికుడిగా పేరొందిన తాపీ ధర్మారావు జన్మదినాన్ని తెలుగు మాధ్యమాల దినోత్సవంగా జరుపుకోవడం అభినందనీయమన్నారు. ఆర్ట్స్-కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు, ఐఏఎస్ఈ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య టి.శోభశ్రీ, తెలుగు శాఖాధ్యక్షుడు ఆచార్య జర్ర అప్పారావు, కామర్స్-మేనేజ్‌మెంట్ స్టడీస్ శాఖాధ్యక్షుడు ఆచార్య జాలాది రవి, సంగీత నృత్య విభాగాధిపతి ఆచార్య ఎస్. అనురాధ, తెలుగు ఆచార్యులు డాక్టర్ బూసి వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
వైజాగ్ వెస్ట్
8978872250


80 అడుగుల రహదారి విస్తరణకు ప్రణాళికలు

- జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ
- జోన్-8లోని పలు ప్రాంతాల్లో పర్యటన


రహదారి ప్లాన్‌ను పరిశీలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, అధికారులు

గోపాలపట్నం: వంటిల్లు వద్ద నుంచి గోపాలపట్నం కుమారి కల్యాణ మండపం వరకు ఉన్న రహదారిని విస్తరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఆయన రహదారి ప్రాంతంలో మంగళవారం పర్యటించారు. క్షేత్ర స్థాయిలో సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారిని 80 అడుగుల రోడ్డు విస్తరణకు ప్లాన్ సిద్ధం చేయాలని నిర్ణయించినట్టు చెప్పారు. స్థానికంగా ఉన్న సమస్యలతో పాటు ఆక్రమణల వివరాలు సేకరించాలని సూచించారు. ప్రత్యేకంగా సుసర్ల కాలనీ నుంచి లక్ష్మీనగర్, ఇందిరానగర్ ప్రాంతాల్లో విస్తరణ చేయాల్సి ఉందన్నారు. దీనిపై అధికారులకు మార్గదర్శకాలు ఇచ్చామన్నారు. అనంతరం రత్నగిరి కాలనీ, చినముషిడివాడ, సుజాతానగర్ ప్రాంతాల్లో కమిషనర్ పర్యటించారు. రత్నగిరి కాలనీ వద్ద థీమ్ పార్క్‌ను సందర్శించారు. పార్కులో మౌలిక సదుపాయాలు, వాకింగ్ ట్రాక్, గ్రీనరీ, లైటింగ్, తాగునీరు, వాచ్‌మెన్ గది మరుగుదొడ్లు వంటివి నిర్మించాలని ఆదేశించారు. సుజాతానగర్, చినముషిడివాడ ప్రాంతాల్లో పారిశుధ్యం సరిగా లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయనతో పాటు జోనల్ కమిషనర్ మల్లయ్యనాయుడు, పర్యవేక్షక ఇంజినీర్ రామ్మోహనరావు, కార్యనిర్వాహక ఇంజినీర్ రమణమూర్తి , ఉప కార్యనిర్వాహక ఇంజినీర్ విజయ్ కుమార్, డీసీపీ పద్మజ, ఏసీపీ జయరామ్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలకు విశేష స్పందన


వైద్య శిబిరంలో కార్పొరేటర్ పూర్ణిమ, శ్రీధర్, వైద్యులు

కంచరపాలెం : జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం సెబాస్టియన్‌కాలనీ, బాబూకాలనీ, జోనల్ కార్యాలయాల్లో వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ జన్మదిన వేడుకల్లో భాగంగా మంగళవారం సెయింట్ జోసెఫ్ కళాశాల ఎన్ఎస్ఎస్ బృందం, రోటరీ బ్లడ్ బ్యాంక్ సంయుక్త ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరాలు జరిగాయి. ముందుగా కార్పొరేటర్ పూర్ణిమ వైఎస్సార్‌సీపీ నాయకుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పేదలకు నిత్యావసర సరకులు, బియ్యం, వృద్ధులకు చీరలు, పండ్లు పంపిణీ చేశారు. అనంతరం ఉచిత కంటి పరీక్షలు, రక్తదాన శిబిరం నిర్వహించారు. యువత రక్తదానం చేయడానికి ముందుగా రావడం అభినందనీయమని బ్లడ్ బ్యాంకు వైద్యులు డాక్టర్ మహేష్ అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ క్లస్టర్ ఇన్‌చార్జి కోడిగుడ్ల శ్రీధర్, వేలంగిణి రావు, పాత్రపల్లి సునీల్, ఈశ్వరి, దేవి, అన్నపూర్ణ, జీవీఎంసీ యూసీడీ విభాగం సీవో సత్యవతి, ఆర్పీలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

950వ రోజుకు ‘ఉక్కు’ దీక్షలు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు కర్మాగారం పరిరక్షణకు కార్మికులు చేస్తున్న ఉద్యమం వారి పోరాట శక్తికి నిదర్శనమని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. ఉద్యమంలో ప్రజలను భాగస్వాములను చేసి మరింత ముందుకు తీసుకువెళ్తామన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 950వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొని, స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మహనీయుల త్యాగఫలంగా ఏర్పాటైన ఉక్కు పరిశ్రమను కాపాడుకోవడం కోసం ఎలాంటి పోరాటానికైనా, ఆఖరికి ప్రాణత్యాగానికైనా సిద్ధమన్నారు. ప్రధాని మోదీ అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై దేశంలోని కార్మికులందరం ఏకమై పోరు సాగిస్తామన్నారు. ఉక్కు పరిశ్రమను కాపాడుకుంటేనే కార్మికులకు భవిష్యత్తు ఉంటుందని, కర్మాగార పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

ఏఐసీటీయూ ప్రధాన కార్యదర్శి కృష్ణారావు మృతి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఏఐసీటీయూ ప్రధాన కార్యదర్శి నేతేటి కృష్ణారావు (57) మృతి చెందారు. ట్రాఫిక్ విభాగంలో జనరల్ ఫోర్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్న కృష్ణారావుకు గత నెలలో గుండెకు శస్త్రచికిత్స జరిగింది. అప్పటి నుంచి అనారోగ్యంగా ఉన్న కృష్ణారావు సోమవారం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ విషయం తెలిసి ఏఐసీటీయూ అధ్యక్షుడు చిత్రాడ సన్యాసిరావు, సీఐటీయూ నాయకులు జె.అయోధ్యరామ్, యు.రామస్వామి, హెచ్ఎంఎస్ అధ్యక్షుడు దొమ్మేటి సన్యాసి రావు ఆస్పత్రికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. సాయంత్రం ఆయన స్వస్థలం జామిలో అంత్యక్రియలు జరిగాయి.

ప్రతి సమస్యకు తక్షణ పరిష్కారం

- నాది నాన్చే ధోరణి కాదు
- సీఎం జగన్ స్ఫూర్తితో అభివృద్ధి కార్యక్రమాలు
- 59వ వార్డు గడప గడపకు కార్యక్రమంలో ఆనంద్‌కుమార్


లబ్ధిదారుకు బ్రోచర్ అందజేస్తున్న ఆనంద్‌కుమార్

మల్కాపురం: తమ పరిధిలో ఎటువంటి సమస్య అయినా తన దృష్టికి తీసుకువస్తే, అక్కడే పరిష్కారానికి ప్రయత్నిస్తానని.. తనది నాన్చే ధోరణి కాదని వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. 59వ వార్డు ములగాడ హౌసింగ్ కాలనీ 322 సచివాలయం పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం జరిగింది. వార్డు కార్పొరేటర్ పుర్రె పూర్ణశ్రీ సురేష్‌యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఆనంద్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 59వ వార్డు పరిధిలో ఇప్పటికే 3 కోట్ల రూపాయలతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. త్వరలో మరో రూ. 3 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపడతామని వివరించారు. రూ. కోటితో పట్టణ ఆరోగ్య కేంద్రం (ఆసుపత్రి)ని ఏర్పాటు చేయడంతో పాటు ప్రతిరోజు ఓ స్పెషలిస్ట్ వైద్యుడు వచ్చి పేదలకు ఉచిత సేవలందించే దిశగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకున్నారన్నారు. వివిధ పథకాల రూపంలో ఒక్కొక్క ఇంటిలో రూ. 6 లక్షల నుండి రూ. 1 వరకు లబ్ధి పొందారంటే పేద ప్రజలపై జగన్‌కు ఉన్న ప్రేమ ఏమిటో అర్థం చేసుకోవాలన్నారు. ఇక్కడ గెలిచిన ఎమ్మెల్యే స్కామ్‌లు చేసి జైలులో కూర్చున్న చంద్రబాబు కోసం దీక్షలు చేయటం సిగ్గుచేటు అన్నారు. తనను గెలిపించిన ప్రజలను విస్మరిస్తున్న నాయకుడు కావాలా, నిత్యం మీ మధ్య ఉండి, మీ సమస్యలు పరిష్కరిస్తున్న నేను కావాలో మీరే ఆలోచన చేయాలని ప్రజలతో అన్నారు. ఈ కార్యక్రమంలో పారిశ్రామిక ప్రాంత ట్రేడ్ యూనియన్ నాయకుడు పుర్రె సురేష్‌యాదవ్, రేవళ్ల సత్యనారాయణ, పెంటారావు, అమరావతి, మంజు, టీవీ రమణి తదితరులు పాల్గొన్నారు.

ఎవరు చేస్తారు ఇలాంటి సాయం..



మా కష్టాలను గుర్తించి ఆర్థికంగా మమ్మల్ని ఆదుకుంటున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ఎల్లప్పుడు రుణపడి ఉంటాం. వివిధ పథకాల ద్వారా 2 లక్షల 48 వేల రూపాయలు సాయం అందించారు. ఇలాంటి సాయం ఎవరు చేస్తారు.

–రెడ్డి లక్ష్మి, ములగాడ హౌసింగ్‌కాలనీ

కష్టాల నుంచి గట్టెక్కించారు..



ఆరోగ్యశ్రీ, పింఛన్, రుణసాయం, ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం.. ఇలా పలు పథకాల ద్వారా అక్షరాలా 8 లక్షల 89 వేల రూపాయలు జగనన్న ప్రభుత్వం ద్వారా మేము సాయం పొందాం. ఇంతటి సాయం కుటుంబ సభ్యులే చేయరు. అలాంటిది మేము నమ్ముకున్న దేవుడు జగనన్న చేశారు.

–నల్లగుండు పకీరు, ములగాడ హౌసింగ్‌కాలనీ

తోడబుట్టిన వాడిలా అండగా నిలిచాడు..



సొంత అన్న మాదిరిగా ఆర్థికంగా అండగా సీఎం జగనన్న నిలిచాడు. ఆయన చేసిన మేలు ఈ జన్మలో మరువను. ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం, చేయూత, ఆసరా, పింఛన్.. ఇలా అక్షరాలా 6 లక్షల 23 వేల రూపాయల సాయం పొందాను.

–నీలపతి నాగమణి, ములగాడ హౌసింగ్‌కాలనీ

స్టీల్‌ప్లాంట్ రక్షణకు నేటి నుంచి బైక్ యాత్ర

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ రక్షణ కోసం నిర్వహించనున్న బైక్ యాత్రను జయప్రదం చేయాలని స్టీల్‌ప్లాంట్ కోక్ ఓవెన్స్ కార్మిక నాయకులు కోరారు. మంగళవారం విభాగంలో జరిగిన కార్యక్రమంలో బైక్ యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. నాయకులు మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్‌పై కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న వైఖరికి నిరసనగా సీపీఎం ఆధ్వర్యంలో బైక్ యాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. ఈ నెల 20న నగరంలోని జీవీఎంసీ గాంధీ విగ్రహం దరి దీక్ష శిబిరం వద్ద ప్రారంభమైన యాత్ర 29న కూర్మన్నపాలెం దీక్ష శిబిరానికి చేరనుందని తెలియజేశారు. ఆ రోజు నిర్వహించనున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌పై వీధి నాటకం


ప్రదర్శన ద్వారా అవగాహన కలిగిస్తున్న కళాకారులు

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు బంక్ జంక్షన్‌లో స్వచ్ఛ సర్వేక్షణ్‌పై కళాకారులు ప్రదర్శించిన వీధి నాటకం ఆలోచింపజేసింది. జీవీఎంసీ పరిధిలో స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా నగరంలో కళాకారులు కళారూపకాలు ప్రదర్శిస్తున్నారు. అందులో భాగంగా నిత్యం రద్దీగా ఉండే బంక్ జంక్షన్‌లో ప్రదర్శించిన రూపకం పలు సమస్యలను ఎత్తి చూపింది. కాల్వల్లో చెత్త వేయడం వల్ల వచ్చే ప్రమాదాలు తెలిపి, తడిపొడి చెత్త వేర్వేరుగా ఇస్తే జీవీఎంసీ వాటిని ఉపయోగించే తీరును వివరించారు. అదెలా పర్యావరణానికి మేలు చేరుకూరుస్తుందో విశదీకరించారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ప్రతి పౌరుడు పాల్గొని మన విశాఖ నగరాన్ని దేశంలో మొదటి స్థానంలో నిలబెట్టాలని కోరారు. ప్లాస్టిక్ సంచులను వాడనాడి.. గుడ్డ సంచులనే వాడాలని సూచిస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్, సిబ్బంది పాల్గొన్నారు.

పురుగుల మందు తాగిన యువకుడి మృతి


వాకాడ తరుణ్ కుమార్(ఫైల్)

సబ్బవరం: డిగ్రీ చదువుకున్నా ఉద్యోగం లేదని మనస్తాపంతో పురుగుల మందు తాగిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. జీవీఎంసీ 88వ వార్డు దువ్వాడలో చోటు చేసుకున్న ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. విజయనగరం జిల్లా ఎస్.కోట మండలం తిమిరాం గ్రామానికి చెందిన వాకాడ సన్యాసిరావు ఉపాధి కోసం గాజువాక వచ్చి కుటుంబ సభ్యులతో జీవనం సాగిస్తున్నాడు. సన్యాసిరావుకు డిగ్రీ పూర్తి చేసిన కుమారుడు తరుణ్ కుమార్(22) ఉన్నాడు. అతను కొంత కాలంగా ఉద్యోగ ప్రయత్నాలు చేస్తున్నాడు. ఉద్యోగం దొరక్కపోవడంతో మానసికంగా ఆందోళన చెందుతున్నాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 17న సబ్బవరం బైక్‌పై వచ్చిన తరుణ్‌కుమార్ అసకపల్లిలో పురుగులమందు తాగాడు. అనంతరం బైక్‌పై వెళ్తూ దువ్వాడ సమీపంలోని నాగదేవత ఆలయం వద్ద స్పృహ తప్పి పడిపోయాడు. స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో విశాఖలోని కేజీహెచ్‌కు తరలించారు.అక్కడ చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత మృతి చెందినట్లు సీఐ రంగనాథం తెలిపారు. మంగళవారం మృతుడి తండ్రి సన్యాసిరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన చెప్పారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వైజాగ్ వెస్ట్
9912222753, 9705933394
Office mail : sakshiadvtvsp@gmail.com